

## ఆకాశం.. అరుదైన దృశ్యం

సూర్యోదయం సందర్భంగా ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. నింగిలో సర్పాకారం కనువిందు చేసింది. బుధవారం తెల్లవారు జామున ఈ అరుదైన ఘట్టాన్ని జిల్లా ప్రజలు ఆసక్తిగా గమనించారు. కొందరు కెమెరాల్లో బంధించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

## న్యూస్‌రీల్

### 'కేఎస్‌ఎన్' మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రొఫెసర్ రమణ, ప్రిన్సిపాల్ సత్యలత

**అనంతపురం ఎడ్యుకేషన్:** స్థానిక కేఎస్‌ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గత డిసెంబర్‌లో నిర్వహించిన మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూయేషన్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ లోకేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత విడుదల చేశారు. 647 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 584 మంది (90.26 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బీఏ ఆనర్స్‌లో 92 మందికి 79 మంది, బీకాం ఆనర్స్ లో 226 మందికి 198, బీఎస్సీ ఆనర్స్‌లో 300 మందికి 284 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను గురువారం కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. రీవాల్యూయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఫిబ్రవరి 6లోపు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. రీవాల్యూయేషన్‌కు రూ. 300, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ. 600 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ హెచ్‌ఎస్ శివశంకర్, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రమణ నాయుడు, అధ్యాపకులు రామలింగారెడ్డి, బి. రామకృష్ణ, అంజన రెడ్డి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

### 'టిస్'లో వివరాలు అప్‌డేట్ చేయండి

**అనంతపురం ఎడ్యుకేషన్:** జిల్లాలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మునిసిపల్, నగరపాలక సంస్థ పరిధిలోని పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించి టీచర్స్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం (టీఐఎస్) లాగిన్‌లో వివరాలు అప్‌డేట్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులందరూ టిస్ లాగిన్‌లో వివరాలు పరిశీలించుకుని ఏవైనా మార్పులు ఉన్నట్లయితే సరి చేసుకోవాలని ఆదేశించారు. 'టిస్' వివరాల ఆధారంగానే పదోన్నతులు, బదిలీలు ఉంటాయని స్పష్టం చేశారు.

### పొరపాటు.. పడరాని పాట్లు!

సాక్షి ఎఫెక్ట్..

**అనంతపురం:** జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల విభాగంలో పొరపాటు జరిగింది వాస్తవమేనని అధికారులు లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. పరీక్షల విభాగంలో 193 మంది విద్యార్థుల జవాబు పత్రాల గల్లంతు అంశంపై 'సాక్షి'లో బుధవారం 'జవాబు పత్రాలకు రెక్కలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో జేఎన్‌టీయూలో కలకలం రేగింది. నష్టనివారణ చర్యలు చేపట్టడానికి పరీక్షల విభాగం అధికారులు చేయరాని ప్రయత్నం లేదు. ఈ క్రమంలోనే ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. జవాబు పత్రాలు పొరపాటున బీటెక్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థుల జవాబు పత్రాల్లో కలిసిపోయాయని, వాటి గుర్తింపులో కొంత ఆలస్యమైందని పేర్కొనడం కొసమెరుపు. పొరపాటు జరిగిందంటూనే... పకడ్బందీగా, కట్టుదిట్టంగా ప్రక్రియ చేపడుతున్నట్లు తెలపడం గమనార్హం. అయితే, మూల్యాంకనం, జవాబు పత్రాల భద్రత అంశంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని తమ భవిష్యత్తును కాపాడాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

### ప్రకృతి వ్యవసాయంతో ఆర్థికాభివృద్ధి

**కూడేరు:** ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొంది ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్,ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మానాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని జల్లిపల్లిలో రైతు ఆదినారాయణ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన మామిడి, ద్రాక్ష తోటను బుధవారం శ్రీలంకకు చెందిన టీంతో కలిసి డీపీఎం లక్ష్మానాయక్ సందర్శించారు. పంటల సాగు గురించి రైతు ఆదినారాయణ వారికి వివరించారు. మామిడి, ద్రాక్ష పంటలకు బీజామృతం, ఘన, ద్రవ జీవామృతం, విత్తన గుళికల తయారీని తెలియజేశారు. పంట పెట్టుబడులు తక్కువగా ఉంటాయని, దిగుబడి ఎక్కువగా సాధించవచ్చని శ్రీలంక బృందానికి లక్ష్మానాయక్ వివరించారు. కార్యక్రమంలో అధికారులు అనురాధ, భానుమతి, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత వంట గ్యాస్ సిలిండర్' పథకంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్భాటంగా చేసిన ప్రకటనలు ఉత్త గ్యాస్‌గా మారాయి. కేవలం కొంతమంది లబ్ధిదారులకే సిలిండర్‌పై సబ్సిడీ డబ్బు జమ చేస్తూ చేతులు దులుపుకుంటున్నట్లు తెలుస్తోంది. సిలిండర్ తీసుకుని నెలలు గడుస్తున్నా డబ్బు అందకపోవడంతో మహిళలు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు.



# అంతా గ్యాసే..!

- 'ఉచిత గ్యాస్ సిలిండర్' ఉత్తిదే
- నెలలు గడిచినా అందని సబ్సిడీ డబ్బు
- బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ మహిళల ప్రదక్షిణలు
- ఎంత తిరిగినా కానరాని ప్రయోజనం
- ప్రభుత్వ అలసత్వంపై సర్వత్రా విమర్శలు

**రాయదుర్గంటౌన్:** దీపం పథకం-2 కింద జిల్లాలో గృహ అవసర కనెక్షన్లు (డొమెస్టిక్) 7,07,901 ఉన్నాయి. వీటిలో ఉచితంగా సిలిండర్ పొందేందుకు 5,05,831 కనెక్షన్లకే అర్హత ఉన్నట్లు కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. ఇందులో ఇప్పటిదాకా 3,83,931 కనెక్షన్లకే నిధులు జమ చేశారు. ఇంకా 1,21,900 మందికి గ్యాస్ సబ్సిడీ వర్తించాల్సి ఉంది. సిలిండర్ బుక్ చేసుకున్న రెండు రోజుల్లో సబ్సిడీ డబ్బు జమ చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన కూటమి ప్రభుత్వం.. ఆచరణకు వచ్చేసరికి చేతులెత్తేసింది. కొందరికి రెండు నెలలైనా సబ్సిడీ జమ కాలేదు.

**ఎవరిని అడగాలి..?**

ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి సంబంధించి సమస్యలపై ఎవరిని ఆశ్రయించాలో తెలియక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నిస్తే తమవద్ద ఎలాంటి సమస్య లేదంటున్నారు. బ్యాంకులోగానీ, పౌర సరఫరాల కార్యాలయంలో గానీ సంప్రదించాలని చెబుతున్నారు. బ్యాంకులకు వెళ్లి విచారిస్తే గ్యాస్ ఆఫీస్‌లోనే తెలుస్తుందంటూ వెనక్కు పంపుతుండటంతో లబ్ధిదారుల ఆవేదన వర్ణనాతీతంగా ఉంటోంది. చాలామంది లబ్ధిదారులు సబ్సిడీపై ఆశలు వదిలేసుకుంటున్నారు. దీనికితోడు ప్రభుత్వం చెప్పినట్లు సిలిండర్ బుక్ చేసుకున్న 48 గంటల్లోపు కాకుండా వారం, 10 రోజుల తరువాత పడుతున్న సబ్సిడీ అందుతున్న పరిస్థితి. అరకొరగా నిధులు విడుదల చేయడంతోనే న్యాయం జరగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

### రెండుసార్లు బుక్ చేసుకున్నా డబ్బు పడలేదు



ఇప్పటి దాకా డబ్బు చెల్లించి రెండు సార్లు గ్యాస్ సిలిండర్ బుక్ చేశా. సబ్సిడీ మాత్రం జమ కాలేదు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను అడిగితే బ్యాంకులో విచారించాలని చెబుతున్నారు. బ్యాంకుకు వెళ్తే ఎలాంటి సమస్య లేదు గ్యాస్ ఆఫీస్‌లోనే విచారించుకోండి అని అంటున్నారు. హామీ మేరకు డబ్బు జమ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– అంజినమ్మ, డి.కొండాపురం, రాయదుర్గం మండలం



| | |
|---|---|
| జిల్లాలో మొత్తం గ్యాస్ ఏజెన్సీలు | 50 |
| డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్లు | 7,07,901 |
| సబ్సిడీకి అర్హతగా నిర్ధారించిన డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్లు | 5,05,831 |

### మోసం చేయడం తగదు



15 రోజుల క్రితం డబ్బు చెల్లించి గ్యాస్ సిలిండర్ బుక్ చేశా. నేటికీ ఖాతాలో డబ్బు పడలేదు. బుక్ చేసిన రెండు రోజుల్లో డబ్బు అందజేస్తామని ప్రారంభంలో చెప్పారు. దీనిపై ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు. ఉచితంగా గ్యాస్ సిలిండర్ పేరిట ప్రజలను మోసం చేయడం తగదు.

– బి.పద్మావతి, ఇందిరమ్మకాలనీ, భంభంస్వామి లేఅవుట్, రాయదుర్గం

### నాకైతే నమ్మకం లేదు



సిలిండర్ బుక్ చేసి రెండు నెలలు గడిచిపోయింది. ఇప్పటికీ సబ్సిడీ డబ్బు జమ కాలేదు. గ్యాస్ ఏజెన్సీ ఆఫీస్, బ్యాంకుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. ఇక ముందు కూడా డబ్బులు జమ అవుతాయనే నమ్మకం లేదు. ఈకేవైసీ కూడా చేయించా. అర్హులందరికీ సబ్సిడీ జమ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– గొల్ల విజయ్‌కుమార్, 27వ వార్డు, రాయదుర్గం

### ఆందోళన అవసరం లేదు



ఉచిత గ్యాస్ సిలిండర్ సబ్సిడీపై లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆధార్ డేటాబేస్‌ను గ్యాస్ ఏజెన్సీతోపాటు బ్యాంకులోనూ పరిశీలించుకోవాలి. బ్యాంకులో అకౌంట్ ఇన్‌యాక్టివ్, ఆధార్ లింకు లేకపోవడం, హోల్డ్ లాంటి సమస్యలు ఉంటాయి. వినియోగదారులు సరిచేసుకోవాలి. గ్యాస్ సబ్సిడీ విషయంలో ఎలాంటి సమస్య తలెత్తినా 1967 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించవచ్చు.

– రమేష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ పౌరసరఫరాల శాఖ అధికారి

## ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

**అనంతపురం:** జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు (ఒకేషనల్) ప్రాక్టికల్స్, ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు (జనరల్) ప్రాక్టికల్స్ రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలన్నారు. జిల్లాలో మొత్తం 149 జూనియర్ కళాశాలలు ఉండగా, అందులో 73 జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 1 నుంచి 20 వరకు థియరీ పరీక్షలను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించాలన్నారు. జిల్లాలో మొత్తం 63 జూనియర్ కళాశాలల్లో మొత్తం 18,591 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్షల కోసం 18 జోన్లను, 23 స్టోరేజ్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఒకేషనల్‌కు సంబంధించి మొత్తం 4,014 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

**నోడల్ అధికారిగా డీఆర్‌ఓ..**

ఇంటర్ పరీక్షల నిర్వహణకు డీఆర్‌ఓను నోడల్ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షల కోసం ఏర్పాటు చేసిన జిల్లా స్ట్రాంగ్ రూం, డీఆర్‌సీ రూంను తనిఖీ చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటుతో పాటు ఆరోగ్య సిబ్బందిని నియామకం చేయాలన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. కేంద్రాల్లో ప్రతి ఒక్కరూ ఐడీ కార్డులు ఉపయోగించాలని కోరారు. సమావేశంలో డీఆర్‌ఓ ఏ. మలోల, ఆర్డీఓ కేశవ నాయుడు, డీవీఈఓ, ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్, డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ, పోలీసు వ్యవస్థ నిర్వీర్యం

- నిస్సహాయ స్థితిలో కలెక్టర్, ఎస్పీ
- విద్యార్థులకు అండగా వచ్చే నెల 5న 'ఫీజు పోరు'
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** 'కూటమి ప్రభుత్వంలో జిల్లాలో శాంతిభద్రతలు కనుమరుగయ్యాయి. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు చేతులెత్తేశారు. కలెక్టర్, ఎస్పీ, డీఐజీలు చేతగాని వాళ్లలా నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కళ్ల ముందే దారుణాలు జరుగుతున్నా.. బాధితుల పక్షాన నిలబడకపోగా రివర్స్ కేసులు నమోదు చేస్తున్నారు. మీడియాలో కథనాలు వస్తే రైలు పట్టాలపై పడుకోబెడతామని ప్రజాప్రతినిధులు బెదిరిస్తున్నా జీ హుజూర్ అంటున్నారు. పోలీసులు ఖాకీ చొక్కాలు వదిలేసి పచ్చ చొక్కాలు వేసుకోవాలి' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న దౌర్జన్యాలపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గుంతకల్లు మండలంలోని చింతలాంపల్లిలో ఇటీవల ఓ స్థల వివాదంలో దాడులు జరిగాక బాధితులు అనంతపురంలో చికిత్స తీసుకున్నారన్నారు. రెండు రోజుల క్రితం మళ్లీ గొడవ జరిగిందని, దెబ్బలు తిన్న బాధితుడు ఫిర్యాదు చేయడానికి పోలీసుస్టేషన్‌కు వెళ్తే పోలీసులు కిషోర్, జాఫర్‌లు గుడ్డలూడదీసి విచక్షణారహితంగా చితకబాదారన్నారు. అతడు భయంతో పరుగులు తీసి రోడ్డు మీదకు వచ్చిన చిత్రాలను మీడియాకు చూపించారు. ఇదే విషయమై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన తమ పార్టీ నాయకులను పోలీసులు దుర్భాషలాడారన్నారు. ఇంత జరుగుతుంటే ఎస్పీ, డీఐజీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

**ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తాం**

గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులుగా పని చేసిన వారు తాము ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకు కూడా వెళ్లకుండా పోలీసులే అడ్డు చెప్పడమేంటని 'అనంత' ప్రశ్నించారు. ఊర్లు విడిచి వెళ్లాలని వైఎస్సార్ సీపీ నాయకులకు డీఎస్పీ, సీఐలు చెబుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజాస్వామ్యంపై తమకు నమ్మకం ఉందని, శాంతిభద్రతల పరిస్థితి ఇలాగే ఉంటే ఉన్నతాధికారుల కార్యాలయాల వద్దకే వెళ్లి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**వచ్చే నెల 5న ఫీజుపోరు..**

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వానికి హెచ్చరికగా, తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు రూ.3,900 కోట్లు చెల్లించాలనే డిమాండ్‌తో వచ్చే నెల 5న ఫీజు పోరు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ విద్యా రంగ అభివృద్ధికి రూ.73 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. 2019లో చంద్రబాబు ప్రభుత్వం రూ.1,780 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టినా రాజకీయ కోణంలో చూడకుండా వాటిని చెల్లించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. గత ఏడాది మార్చిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.708 కోట్లు విడుదల చేసిందని, అయితే అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపుల ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ఇటీవల చంద్రబాబు ప్రభుత్వం రూ.700 కోట్లు విడుదల చేస్తామని చెప్పి ఇప్పటి వరకు రూపాయి ఇవ్వలేదన్నారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ పట్టించుకోవడం లేదన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు కూడా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగన్న, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, ఓబిరెడ్డి, ఎద్దుల అమర్‌నాథ్ రెడ్డి, మల్లెమీద నరసింహులు, చంద్రశేఖర్ యాదవ్, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

# హాజరయ్యేరా..? గళం విప్పేరా..?

- నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం
- ఎమ్మెల్యేలందరూ వస్తారో..లేదో అన్న దానిపై సందిగ్ధం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సమస్యలతో ప్రజల సతమతం



**అనంతపురం సిటీ:** ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరగనుంది. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. 2024 జూలై 9న తొలి సమావేశం నిర్వహించారు. అప్పట్లో అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి సహా ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలంతా హాజరయ్యారు. అయితే, అదే ఏడాది అక్టోబర్ 19న జరిగిన రెండో జెడ్పీ సర్వసభ్య సమావేశానికి కేవలం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పుట్టపర్తి, మడకశిర ఎమ్మెల్యేలు పల్లె సింధుర రెడ్డి, ఎంఎస్ రాజు మాత్రమే హాజరయ్యారు. ఇద్దరు ఎంపీలు, తొమ్మిది మంది ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. మంత్రులు పయ్యావుల కేశవ్, ఎస్.సవితమ్మలు ఇప్పటి వరకు జెడ్పీ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జెడ్పీ సమావేశాలకు ఒక్కసారి కూడా రాకపోవడం గమనార్హం. ఈ క్రమంలో గురువారం జరగనున్న సర్వసభ్య సమావేశానికైనా ఎమ్మెల్యేలంతా హాజరయ్యేరా అనే చర్చ నడుస్తోంది.


**'శ్రీసత్యసాయి' కలెక్టర్‌కు ఏమైంది?**

జిల్లాల పునర్విభజన తరువాత శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బసంత్‌కుమార్ మాత్రమే జెడ్పీ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యే వారు. దీంతో అన్ని శాఖల అధికారులు కూడా సమావేశాలకు వచ్చేవారు. అయితే, బసంత్ కుమార్ తరువాత వచ్చిన కలెక్టర్లు జెడ్పీ సమావేశాలకు రావడం లేదు. ఈ విషయంపై గత జెడ్పీ సమావేశంలో సభ్యులు నిరసన తెలిపారు. శ్రీసత్యసాయి కలెక్టర్ సహా అన్ని శాఖల అధికారులు రావాల్సిందేనని, లేకపోతే సమావేశాలను బహిష్కరిస్తామని ప్రకటించారు. అప్పట్లో అనంతపురం కలెక్టర్ వినోద్ కుమార్ కలుగజేసుకొని వచ్చే సమావేశానికి శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కచ్చితంగా హాజరయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఈ సమావేశానికైనా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ హాజరవుతారో లేదో చూడాలి.

**సమస్యల విలయ తాండవం**

జిల్లాలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. వేసవికి ముందే చాలా ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. విద్యుత్ కోతలు రైతులను కుంగదీస్తున్నాయి. పశువులకు గ్రాసం దొరకడం లేదు. మెరుగైన వైద్యం గగనమవుతోంది. మరోవైపు జిల్లాలో శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారాయి. రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. ఊరూరా బెల్ట్ షాపులు వెలిశాయి. బాల్య వివాహాలు నిత్యకృత్యంగా మారాయి. సామాజిక పింఛన్లలో కోతపై పేదలు అల్లాడిపోతున్నారు. ఇలా సమస్యలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న తరుణంలో జరుగుతున్న జెడ్పీ సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రజా ప్రతినిధులందరూ హాజరై సమస్యలపై చర్చించి, పరిష్కారం చూపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# సీనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య



లక్ష్మీపతి రెడ్డి (ఫైల్)

**బుక్కరాయసముద్రం:** సీనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని దయ్యాలకుంటపల్లి వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. దయ్యాలకుంటపల్లికి చెందిన లక్ష్మీపతి రెడ్డి (55) కళ్యాణదుర్గంలోని ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఈయన మొదటి భార్య క్రిష్ణవేణి 22 ఏళ్ల క్రితం మరణించగా.. ఆమె చెల్లెలు శ్రీవాణిని లక్ష్మీపతి రెడ్డి రెండో పెళ్లి చేసుకున్నారు. అయితే, శ్రీవాణి 13 ఏళ్ల క్రితం భర్త నుంచి విడిపోవడంతో లక్ష్మీపతి రెడ్డి అనంతపురంలోని ద్వారకా విల్లాస్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. లక్ష్మీపతి రెడ్డికి, శ్రీవాణికి నడుమ కొన్ని రోజులుగా ఆస్తి తగాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి శ్రీవాణి, ఆమె తల్లిదండ్రులు వెళ్లి లక్ష్మీపతిరెడ్డితో గొడవ పడ్డారు. ఈ క్రమంలోనే ఆయన దయ్యాలకుంటపల్లికి వచ్చి తన ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తెల్లవారు జామున ఇరుగు పొరుగు వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి సీఐ కరుణాకర్ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నోరెత్తితే బూతులే

- నియంతలా ఉన్నతాధికారి
- ఉద్యోగులకు నిత్య నరకం

**కళ్యాణదుర్గం:** హోదాకు తగ్గట్టు హుందాగా ఉండాల్సిన ఆయన నోటికి పనిచెబుతున్నారు. బూతులతో కింది స్థాయి ఉద్యోగులను హడలెత్తిస్తున్నారు. ఆ అధికారి వేధింపులు భరించ లేక సిబ్బంది సెలవులపై వెళ్తున్నారు. రెవెన్యూ డివిజన్‌లో ఉన్నతాధికారి అయిన ఆయన పేరెత్తితే తహసీల్దార్ నుంచి వీఆర్‌ఏ వరకు అందరూ హడలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఎలా మాట్లాడతాడో.. ఏ సమయంలో ఎవరిని దూషిస్తాడనే భయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన వ్యవహార శైలి నచ్చక కార్యాలయంలో కీలకంగా ఉన్న మహిళా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఇటీవల రెండు నెలలకు పైగా సెలవులో వెళ్లిపోయారు. ఓ డిప్యూటీ తహసీల్దార్ సైతం టార్చర్ భరించలేక సెలవు తీసుకున్నట్లు సమాచారం. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది సైతం సెలవుపై వెళ్లినా.. తప్పని పరిస్థితుల్లో తిరిగి విధుల్లో చేరినట్లు తెలిసింది.

**నోటికొచ్చినట్లు తిట్లు..**

కార్యాలయంలో తిట్ల దండకం నిత్యం పరిపాటిగా మారింది. కొన్ని రోజుల క్రితం కార్యాలయంలో పనిచేసే పలువురు ఉద్యోగులను బూతులు తిట్టడమే కాకుండా ఏకంగా కాలు కూడా ఎత్తినట్లు తెలిసింది. గుమ్మఘట్ట మండలంలో పనిచేసే ఓ వీఆర్వోను 'రేయ్ మెంటల్ నాకొడకా.. నీకు తలకాయ ఉందా... నువ్వు నా డివిజన్‌లో ఉండాల్సిన అవసరం లేదు... వెంటనే మరోచోటుకు వెళ్లిపో..' అంటూ తీవ్ర స్థాయిలో నోరు పారేసుకున్నట్లు సమాచారం. ఇదంతా బయటకు చెప్పుకోలేక ఉద్యోగులు సదరు అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఏది ఏమైనా బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న డివిజన్ స్థాయి అధికారి కింది స్థాయి ఉద్యోగులపై నిత్యం విరుచుకుపడుతుండటంపై పలువురు మండిపడుతున్నారు.

## క్లుప్తంగా

### డీజిల్ అపహరణ



డీజిల్ చోరీ చేయడంతో నిలిచిపోయిన లారీలు

**గుత్తి రూరల్:** మండలంలోని బాచుపల్లి శివారున 44వ జాతీయ రహదారి పక్కన ఆపిన రెండు లారీల నుంచి 800 లీటర్ల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం వేకువజామున అపహరించారు. దీంతో లారీలు అక్కడే ఆగిపోయాయి. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు లోడుతో బయలుదేరిన లారీ డ్రైవర్లు నిద్ర ముంచుకు రావడంతో బాచుపల్లి శివారున రోడ్డు పక్కన పెట్రోల్ బంక్ వద్ద ఆపి నిద్రించారు. ఉదయం నిద్ర లేచి చూసేసరికి డీజిల్ ట్యాంకులకు ఉన్న మూతలు తెరిచి ఉన్నాయి. అనుమానం వచ్చి పరిశీలిస్తే ట్యాంకులు ఖాళీగా కనిపించాయి. బాధితుల ఫిర్యాదు మేరకు రెండు లారీల్లో రూ.78 వేలు విలువ చేసే 800 లీటర్ల డీజిల్ అపహరించినట్లు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### చీటింగ్ కేసు నమోదు

**ఉరవకొండ:** బ్యాంక్‌లో ఉద్యోగమంటూ ఓ మహిళను మోసగించి నగదు దండుకున్న అంశానికి సంబంధించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలను ఉరవకొండ ఎస్‌ఐ జనార్దననాయుడు బుధవారం వెల్లడించారు. ఉరవకొండడలోని ఇందిరానగర్‌కు చెందిన ఓ మహిళకు హైదరాబాద్‌కు చెందిన అక్షయ్‌నందన్ అనే వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్‌లో ఉద్యోగం కల్పిస్తున్నట్లు నమ్మబలికాడు. ఈ క్రమంలో పలు దఫాలుగా రూ.23 లక్షల వరకూ నగదును తన ఖాతాకు బదిలీ చేయించుకుని, ఆ తర్వాత చేతులెత్తేశాడు. దీంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న బాధితురాలి ఫిర్యాదు మేరకు అక్షయనందన్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### రైల్వే విశ్రాంత ఉద్యోగి బలవన్మరణం



మృతుడు నోయల్

**గుంతకల్లుటౌన్:** స్థానిక భాగ్యనగర్ గంటచర్చి ప్రాంతంలో నివాసముంటున్న రైల్వే విశ్రాంత ఉద్యోగి నోయల్ ల్యాంబ్(35) ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపిన మేరకు 9 ఏళ్ల క్రితం రైల్వే ఉద్యోగిగా ఉన్న సమయంలో నోయల్‌కు వివాహం జరిగింది. అయితే దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా మొదట్లోనే విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి మద్యానికి బానిసైన ఆయన విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో విధుల నుంచి అధికారులు తొలగించారు. అయినా ఆయన తీరు మారకపోవడంతో కుటుంబసభ్యులు విసుగు చెంది హైదరాబాద్‌కు మకాం మార్చారు. ఈ క్రమంలో అనారోగ్యంతో పాటు ఒంటరి జీవితాన్ని తాళలేక బుధవారం ఉదయం తన ఇంట్లోనే పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

- చిన్న పోస్టులపై తెగని 'పెద్ద' పంచాయితీ
- టీడీపీ నేతల ఒత్తిళ్లతో కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో ఆగిన పోస్టుల భర్తీ
- నియామక ఉత్తర్వులు అందుకున్న వారు విధుల్లో చేరకుండా బెదిరింపులు
- బాధితుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలే అత్యధికం
- ఉన్నతాధికారులు ప్రేక్షకపాత్ర

## రాజకీయ గ్రహణం..

# వీడని వైనం





**అనంతపురం ఎడ్యుకేషన్:** జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూళ్లల్లో చిన్నచిన్న పోస్టుల భర్తీపై ఇంకా పంచాయితీ తెగలేదు. తమ పరిపాలన పారదర్శకంగా ఉందంటూ పదేపదే చెబుతున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్... ఆయన శాఖకు సోకిన రాజకీయ గ్రహణంపై పెదవి విప్పకపోవడం గమనార్హం. విపరీతమైన రాజకీయ జోక్యం కారణంగా చోటు చేసుకుంటున్న అక్రమాలు నారా లోకేష్‌కు కనిపించకపోవడం బాధాకరమని పలువురు బాధితులు వాపోతున్నారు. కేవలం తాము చెప్పిన వారి (అర్హత లేకపోయినా) పేర్లు లేవనే కారణంగా కేజీబీవీలు, మోడల్ స్కూళ్లల్లో స్వీపరు, స్కావెంజరు, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, చౌకీదారు, వాచ్‌మన్, స్వీపరు పోస్టుల భర్తీని అడ్డుకున్నారనే అపవాదును జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులు మూట కట్టుకున్నారు. ప్రజాప్రతినిధులకు సర్దిచెప్పి సమస్య పరిష్కరించాల్సిన ఉన్నతాధికారులు సైతం ప్రేక్షకపాత్ర వహించారు.

**తీవ్రస్థాయి ఒత్తిళ్లు**

చాలాచోట్ల తాము సూచించిన వారి పేర్లు లేకపోవడంతో టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధుల కోపం కట్టలు తెచ్చుకుంది. తమ నియోజకవర్గాల్లో ఏ ఒక్కరినీ చేర్చుకోవద్దని మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. కొందరు ఉన్నతాధికారులు కల్పించుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వారి కోపం చల్లారలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ ప్రక్రియను 'హోల్డ్'లో పెట్టారు. ఓ ప్రజాప్రతినిధి తల్లి నేరుగా సమగ్రశిక్ష అధికారులకు ఫోన్లు చేసి 'నేను చెప్పిన వారి పేర్లు ఇంకా ఎందుకు జాబితాలో చేర్చలేదు. వారు ఇంకా ఎందుకు విధులకు రావడం లేదు' అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మరో ప్రజాప్రతినిధి తన నియోజకవర్గంలో 'నేను చెప్పిన వారు కాకుండా ఏ ఒక్కరు కొత్తవాళ్లు వచ్చినా ఒప్పుకోను' అని బెదిరింపులకు దిగారు. వారు సూచించిన వారిలో ఎక్కువ మంది ప్రభుత్వం విధించిన నిబంధనల మేరకు అనర్హులు కావడంతో ఈ ప్రక్రియ కాస్త అధికారులకు తలనొప్పిగా మారింది. దీనికితోడు ఇప్పటికే నియామక ఉత్తర్వులు అభ్యర్థులకు అందజేశామని, ఇప్పుడు వారిని తప్పించి కొత్తవారిని ఎలా ఎంపిక చేయాలో అర్థం కాక తలలు పట్టుకున్నారు. కాగా, వీరిలో మెజార్టీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారే ఉండడం విశేషం. కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు తమ కడుపు కొడుతున్నారంటూ బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

**అసలేం జరిగిందంటే...**

జిల్లాలోని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న కుక్, వాచ్‌మన్, చౌకీదారు, స్వీపరు, స్కావెంజరు పోస్టులకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ క్రమంలో ఆయా పోస్టులకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం విధించిన నిబంధనలను అనుసరించి 67 మందిని ఎంపిక చేశారు. వీరందరికీ ఈ నెల 7న సమగ్రశిక్ష అధికారులు నియామక ఉత్తర్వులు అందజేశారు. 8న విధుల్లో చేరాలని పేర్కొన్నారు. వారు చెప్పిన మేరకు చిరుద్యోగులందరూ 8న వెళ్తే ఏ ఒక్కరినీ విధుల్లోకి చేర్చుకోలేదు. సమగ్రశిక్ష కార్యాలయం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదంటూ కేజీబీవీ ఎస్‌ఓలు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు అడ్డుచెప్పారు. తక్కిన చాలా జిల్లాల్లో ఈ ప్రక్రియ పూర్తయినా ఒక్క అనంతపురం జిల్లాలో మాత్రం రాజకీయ ఒత్తిళ్ల కారణంతగా ఎటూ తేల కుండా ఉండిపోయింది.

### వీరజవాన్ల పారితోషికాన్ని పెంచాలి

- ప్రధాని మోదీకు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి లేఖ
- కేంద్ర హోంశాఖ నుంచి సానుకూల స్పందన



**ఉరవకొండ:** దేశ రక్షణలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లకు చెల్లిస్తున్న పారితోషికాన్ని పెంచి వారి కుటుంబాలకు అండగా నిలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి విన్నవించారు. ఈ మేరకు కొన్ని రోజుల క్రితం ప్రధాని నరేంద్రమోదీకు ఆయన లేఖ రాయగా.. దీనిపై కేంద్ర హోంశాఖ సానుకూలంగా స్పందించింది. వివరాలను బుధవారం శివరామిరెడ్డి వెల్లడించారు. వీర జవాన్లకు ఇప్పటి వరకూ రూ.25 లక్షలు మాత్రమే ఎక్స్‌గ్రేషియాను కేంద్రం చెల్లిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి సాయం ఉండదు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దీనికి పరిష్కార దిశగా ప్రధానితో పాటు కేంద్ర హోం, రక్షణ మంత్రిత్వ శాఖ, ఏపీ ముఖ్యమంత్రికి లేఖలు రాశారు. వీర జవాన్ల పారితోషికాన్ని రూ.2 కోట్లకు పెంచి, వారి కుటుంబానికి నివేశన స్థలం, కుటుంబసభ్యుల్లో ఒకరికి గ్రూప్–1 లేదా గ్రూప్–2 ఉద్యోగాలు కల్పించాలని, వారి పిల్లలు ఎంత వరకు చదివితే అంత వరకూ ఉచితంగా చదివించాలని లేఖలో కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర హోం, రక్షణ మంత్రిత్వ శాఖ లేఖను.. ఎక్స్–సర్వీస్‌మెన్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు ఎండార్స్ చేస్తున్నట్లు తెలిపింది. ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వీరజవాన్ల కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కోరారు.

## చదువులకు పంపిస్తే శవాలుగా మారుస్తారా?

- విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన కళాశాలను సీజ్ చేయాల్సిందే
- మంత్రివర్గం నుంచి నారాయణను తొలగించాల్సిందే
- ఐక్య విద్యార్థి సంఘం డిమాండ్



ధర్నా చేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** పిల్లలను చదువుకునేందుకు నారాయణ విద్యా సంస్థలకు శవాలుగా మారుస్తున్నారని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం నగర శివారు సోములదొడ్డి సమీపంలోని నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇటీవల మొదటి సంవత్సరం విద్యార్థి చరణ్ కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోములదొడ్డి అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్లి నారాయణ కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న, ఏఐఎస్బీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ విద్యార్థి కళాశాల భవనంపై నుంచి దూకి చనిపోయినా పోలీస్ యంత్రాంగం ఇప్పటిదాకా నారాయణ విద్యా సంస్థల యాజమాన్యంపై కేసు నమోదు చేయలేదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్థిక శాఖ మంత్రి, వైద్యశాఖ మంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ముగ్గురు ఉన్నా ఈ ఘటనపై నోరు మెదపలేదన్నారు. తమ సహచర మంత్రి నారాయణకు చెందిన కళాశాల కావడంతోనే వారు స్పందించలేదని ధ్వజమెత్తారు. ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్ నారాయణ విద్యాసంస్థలు ఇస్తున్న కాసులకు కక్కుర్తి పడి ఇప్పటిదాకా ఆ కళాశాలలో ఏం జరిగిందనే అంశంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వలేదని, తక్షణమే ఆయన్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మృతి సమయంలో అక్కడున్న రక్తపు మరకలు చెరిపివేసినా పోలీస్ యంత్రాంగం కేసు నమోదు చేయలేదన్నారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసినా గాలికి వదిలేశారన్నారు. తక్షణమే నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని, మంత్రి నారాయణను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ. కోటి పరిహారం అందించాలని కోరారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కళాశాలను ముట్టడించేందుకు ప్రయత్నించిన విద్యార్థి నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి నరేష్, ఏఐఎస్బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, వీఎస్‌ఐవీ కార్యదర్శి వినోద్ కుమార్, జనసేన విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి సిద్దు, ఏఐఎస్‌ఎఫ్ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు హనుమంతు రాయుడు, సిద్దు, ఐక్య విద్యార్థి సంఘం నాయకులు అంజి, వంశీ, మంజు, చందు, గిరి, సాయి, రాజేష్, కార్తీక్, నాని, సమీర్, యశ్వంత్ పాల్గొన్నారు.

## వికసిత అనంత దిశగా కృషి చేయాలి

- 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న లంకా దినకర్

**అనంతపురం:** ప్రస్తుత సవాళ్లను అధిగమిస్తూ 'వికసిత అనంతపురం' దిశగా లక్ష్యసాధనకు కృషి చేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలసి సంబంధిత జిల్లా అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం , ప్రతి గ్రామ పరిధిలోని ప్రతి గృహానికి సురక్షిత తాగునీరు ఇచ్చే సంకల్పంతో చేపట్టిన జల్ జీవన్ మిషన్ అమలు తీరు, అనంతపురం నగరంలో అమృత్ పథకం నిధుల వినియోగంతో సాధించిన ఫలితాలు, జిల్లాను ఎలక్ట్రానిక్ వస్తు తయారీ కేంద్రంగా మార్చడానికి రూపొందిచన ప్రణాళికలపై చర్చించారు. ఉపాధి హామీ పథకం హామీలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.201.63 కోట్లతో ఇప్పటి వరకు రూ.117.56 కోట్లు మాత్రమే వ్యయం చేశారని, దాదాపు 85 కోట్ల నిధులు మురిగిపోయే ప్రమాదం ఉన్నందున, ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకం అమలులో వేగం పెంచాలన్నారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, సీపీఓ అశోక్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, డ్వామా పీడీ సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

## విద్యావ్యతిరేక విధానాలపై పోరుబాట

- ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** విద్యా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ఉన్న కూటమి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పోరుబాట పడతామని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు హెచ్చరించారు. బుధవారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడారు. 117 జీఓ రద్దు స్థానంలో ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియను ఖండిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన 117 జీఓను రద్దు చేస్తామని విపక్షంలో ప్రకటించిన కూటమి పెద్దలు... అధికారం చేపట్టిన తర్వాత జీఓ రద్దు మాట మరిచి, ప్రత్యామ్నాయ మార్గదర్శకాలంటూ విపరీత పోకడలకు పోతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో విద్యారంగానికి భారీ నష్టం చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల్లో ఉండే ఆదర్శ ప్రైమరీ పాఠశాలలకు 3, 4, 5 తరగతుల పిల్లలు వెళ్లలేక డ్రాపౌట్స్‌గా మారే ప్రమాదముందన్నారు. దీంతో పాఠశాల విద్య మరింత నిర్వీర్యమవుతుందన్నారు. జీవనోపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్లిన బడుగు, బలహీన వర్గాలకు చెందిన తల్లిదండ్రుల వెంట విధిలేని పరిస్థితుల్లో పిల్లలు కూడా వెళ్లి ఉంటారన్నారు. అలాంటి పిల్లల పేర్లను మూకుమ్మడిగా పాఠశాలల రికార్డుల నుంచి తొలిగించడం సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, నరేష్‌కుమార్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు సర్దార్‌వలి, నాయకలు వెంకటరమణ, రామ్మూర్తి, వన్నప్ప పాల్గొన్నారు.



### న్యాయం చేయాలంటూ పోలీసు స్టేషన్ ముట్టడి



పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన గ్రామస్తులు

**ఉరవకొండ:** వృద్ధురాలి మృతికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి, న్యాయం చేయాలంటూ బుధవారం ఉరవకొండ పోలీస్ స్టేషన్‌ను బాధిత కుటుంబసభ్యులు ముట్టడించారు. ఘటనతో దాదాపు గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. వివరాలు... ఉరవకొండ మండలం చిన్నముష్టూరు గ్రామానికి చెందిన సుభద్రమ్మ (77) మంగళవారం ఉదయం రహదారి దాటుతున్న సమయంలో వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొని మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేయడంలో పోలీసులు అలసత్వం వహిస్తున్నారంటూ చిన్నముష్టూరు వాసులు బుధవారం ఉదయం పెద్ద సంఖ్యలో ఉరవకొండ పీఎస్‌కు చేరుకుని ధర్నా చేపట్టారు. ఆందోళనకారులతో సీఐ మహనంది, ఎస్‌ఐ జనార్దననాయుడు చర్చించినా ఫలితం లేకపోయింది. కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తే సహించబోమంటూ హెచ్చరించారు. చివరకు పోలీసులు న్యాయం చేస్తామని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.

### పామిడిలో బయటపడిన శాసనం



కన్నడ లిపిలో రాతిపై చెక్కిన 16వ శతాబ్దం నాటి శాసనం

**పామిడి:** పామిడి గ్రామ శివారున కొండ ప్రాంతంలో బుధవారం ఓ శిలాశాసనాన్ని అనంతపురానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ సిద్ధగిరి గుర్తించారు. కన్నడ లిపిలో ఉన్న ఈ శాసనం 16 శతాబ్దానికి చెందినదిగా ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించిందన్నారు. దీనిపై లోతైన అధ్యాయనం చేయనున్నట్లు తెలిపారు.

### 'ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలి'

**అనంతపురం టవర్‌క్లాక్:** ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో కేటాయింపులు జరగాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన రవిశంకర్ డిమాండ్ చేశారు. అనంతపురంలోని ఎన్జీఓ హోంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారన్నారు. జనాబా ప్రాతిపదికన రూ.12 లక్షల కోట్లకు తక్కువ కాకుండా ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లెక్చరర్ సుగప్ప పాల్గొన్నారు.


### అర్హులకు సబ్సిడీ రుణాలు

**అనంతపురం రూరల్:** ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్వయం ఉపాధి పథకం కింద జనరిక్ మెడికల్ షాపుల నిర్వహణకు ఆసక్తి ఉన్న బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ కులాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిబ్రవరి 7వ తేదీలోపు https://apobmms.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

### యువకుడి ఆత్మహత్య

**కళ్యాణదుర్గం రూరల్:** ఒంటరి జీవితాన్ని తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... కళ్యాణదుర్గంలోని భట్టువాని కాలనీకి రాజేష్ (32) తల్లిదండ్రులు కొన్ని సంవత్సరాల క్రితం మృతిచెందారు. అప్పటి నుంచి ఇంట్లో ఒంటరిగా జీవించే ఆయన .. మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తన ఇంట్లో మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

### అప్పుల బాధతో..



రామాంజినేయులు

**ఉరవకొండ:** అప్పులు తీర్చే మార్గం కానరాక మనోవేదనకు గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన రామాంజినేయులు (47)కు భార్య శ్రీలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఏడాది కాలంగా అద్దెలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. ఈ క్రమంలో వడ్డీల భారం పెరిగి అప్పులు రూ.3 లక్షలకు చేరుకున్నాయి. ఈ మొత్తాన్ని తీర్చే మార్గం కానరాక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రామాంజినేయులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## పాత టీవీలు కొంటాం...



ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన సీఆర్టీ మానిటర్ (కేథోడ్ రే ట్యూబ్) టీవీలు నేడు కనిపించడం లేదు. ఒకవేళా ఉన్నా... చూసిన వారు 'ఇంకా ఈ టీవీని మీరు వాడుతున్నారా?' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేయడం పరిపాటిగా మారింది. మారిన టెక్నాలజీకి అనుగుణంగా ఎల్సీడీ (లిక్విడ్ క్రిస్టల్ డిస్ప్లే), టీఎఫ్టీ (థిన్ ఫిల్మ్ ట్రాన్సిస్టర్), ఎల్ఈడీ మానిటర్, ప్లాజ్మా మానిటర్ టీవీలు మార్కెట్‌లోకి వచ్చిన తర్వాత సీఆర్టీ మానిటర్ టీవీలు కనుమరుగవుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం అనంతపురంలో కేథోడ్ రే ట్యూబ్‌లను ఇలా రిక్షాపై వేసుకుని గుజరీకి తీసుకెళుతూ ఓ కార్మికుడు 'సాక్షి' కెమెరాకు చిక్కాడు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

## క్లుప్తంగా

### 'రాచరికం' సినిమాను ఆదరించాలి



మాట్లాడుతున్న హీరోలు వరుణ్ సందేశ్, విజయ్ తదితరులు

**అనంతపురం కల్చరల్:** అనంతపై అభిమానంతో నిర్మాత ఈశ్వర్ రాయలసీమ ప్రాంత వాసులకు ప్రాధాన్యతనిస్తూనే అన్ని సినిమా పరిశ్రమల నటీనటులతో నిర్మించిన 'రాచరికం' సినిమాను ఆదరించాలని హీరోలు వరుణ్ సందేశ్, విజయ్ కోరారు. రాచరికం సినిమా ప్రామోషన్ కోసం వీరు అనంతకు విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్మాత ఈశ్వర్, హీరోయిన్ అప్సర రాణి తదితరులతో ఓ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 31న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నామని తెలిపారు. నిర్మాతగా అనంతపురంపై అభిమానంతో ఇక్కడి సమస్యలు, ప్రత్యేకతలపై దృష్టి సారించి సగ భాగంపైగా షూటింగ్ జరిపినట్లు పేర్కొన్నారు. సినిమాను అందరూ ఆదరిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

### వైభవంగా మబ్బు దేవర



అలంకరణలో పోతులయ్య స్వామి



అలంకరణలో పెద్దమ్మ దేవత

**రాప్తాడు:** మండలంలోని ఎం.చెర్లోపల్లిలో గ్రామంలో బుధవారం మబ్బు దేవరను వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి పోతులయ్య (బొ్రాయి) స్వామికి పెద్ద ఎత్తున పూజలు జరిగాయి. అనంతరం రాత్రి 12 గంటలకు పోతులయ్య స్వామికి మేకపోతును బలి ఇచ్చారు. అక్కడే మేకపోతును పూడ్చి వేశారు. బుధవారం ఉదయం పెద్దమ్మ, ముత్యాలమ్మ దేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామంలో రెండేళ్ల తర్వాత దేవర జరగడంతో ప్రజలు పోటెత్తారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఎం.చెర్లోపల్లి గ్రామం జన సంద్రమైంది. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పోతులయ్య, పెద్దమ్మ అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు. దేవరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


### వృత్తి విద్య కోర్సులతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్య అధికారి వెంకటరమణ నాయక్

**అనంతపురం ఎడ్యుకేషన్:** వృత్తి విద్యా కోర్సుల ద్వారా అపారమైన ఉపాధి అవకాశాలు ఉంటాయని జిల్లా వృత్తి విద్యా అధికారి వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 'టెక్నికల్ ఒకేషనల్ అప్రెంటిషిప్ ట్రైనింగ్'పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ గురుప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు జిల్లా వృత్తివిద్యా అధికారితో పాటు ఆర్‌డీఎస్‌డీఈ ట్రైనింగ్ అధికారి అప్పారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాధారణ విద్య కంటే వృత్తి విద్య ద్వారా వెంటనే స్థిరపడొచ్చన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి జె.శివప్రసాద్ పాల్గొన్నారు.

### ర్యాష్ డ్రైవింగ్ చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాసులు

**అనంతపురం సెంట్రల్:** అతివేగంతో వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ దాసరి శ్రీనివాసులు హెచ్చరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల బస్సు డ్రైవర్లు, ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవర్లు సమయాన్ని గౌరవించాలని తెలిపారు. అనవసర వేగం పెంచకూడదని సూచించారు. నిద్రలేమి, రాత్రి వేళ డ్రైవింగ్ చేసే వారు తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జ్ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల బెడదకు చెక్

- కుక్కల సంతానోత్పత్తి కాకుండా చర్యలు
- నగరంలో 4,500 కుక్కలకు స్టెరిలైజేషన్ లక్ష్యం
- ఫిబ్రవరి 1 నుంచి చేపట్టేందుకు ప్రణాళిక





కుక్కలను తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనం

**అనంతపురం కార్పొరేషన్:** ఎట్టకేలకు నగరపాలక సంస్థ అధికారుల్లో చలనం వచ్చింది. గత కొన్ని నెలలుగా నగరవాసులు కుక్కల బెడదతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మేయర్ వసీం చాలా సార్లు కుక్కల బెడదకు పరిష్కారం చూపాలంటూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏబీసీ సర్టిఫికెట్ జాప్యంతో కుక్కలకు స్టెరిలైజేషన్ (సంతానోత్పత్తి కాకుండా చేసే ప్రక్రియ) జాప్యం జరిగిందంటూ అధికారులు చెప్పుకొచ్చారు. శిక్షణలో భాగంగా ఇటీవల నగరపాలక సంస్థకు అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న వచ్చారు. ప్రధానంగా కుక్కల బెడద సమస్యకు పరిష్కారం చూపాలని కమిషనర్ మల్లికార్జున రెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తిని ఆదేశించారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 1 నుంచి కుక్కలకు స్టెరిలైజేషన్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

**విడతల వారీగా స్టెరిలైజేషన్**

నగరంలోని 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో 4,500 కుక్కలు ఉన్నట్లు ప్రజారోగ్యాధికారులు గుర్తించారు. కాగా విడతల వారీగా స్టెరిలైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు. రాజస్థాన్‌కు చెందిన సంతూలన్ జీవన్ కళ్యాణ్ ఏజెన్సీ స్టెరిలైజేషన్ చేపట్టనుంది. ఒక్కో కుక్కకు స్టెరిలైజేషన్ చేసి రెండు రోజుల పాటు అక్కడే ఉంచి తర్వాత అవి సంచరించే యథా స్థానాల్లో వదిలేసేలా ఏజెన్సీతో ఒప్పందం ఇది వరకే ఉంది. ఇందుకోసం ఒక్కో కుక్కకు రూ.1,500 నగరపాలక సంస్థ చెల్లించనుంది. ఇదిలా ఉండగా స్టెరిలైజేషన్‌కు సంబంధించి కంపోస్టు యార్డులో ఇది వరకే ఉన్న 80 టన్నల్స్‌కు మెరుగులుదిద్దేలా చర్యలు తీసుకున్నారు. 4 వేల లీటర్ల పట్టే ట్యాంకులు, డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేసేలా నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో రెండు, మూడ్రోజుల్లో సదరు ఏజెన్సీకి వర్క్ ఆర్డర్ ఇవ్వనున్నారు.

> **స్టెరిలైజేషన్ చేపడతాం**
>
> నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కుక్కలకు స్టెరిలైజేషన్ చేసి సంతానోత్పత్తి కాకుండా చర్యలు తీసుకోనున్నాం. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయనున్నాం. నగరవాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.
>
> – మల్లికార్జున రెడ్డి, కమిషనర్, నగరపాలక సంస్థ

## తపాలా ఎస్పీపై చర్యలు తీసుకోండి



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కలిసి ఫిర్యాదు చేస్తున్న తపాలా ఉద్యోగులు

**అనంతపురం సిటీ:** అనంతపురం డివిజన్ తపాలా సూపరింటెండెంట్ (ఎస్పీ) గుంపుస్వామిపై చర్యలు తీసుకోవాలని ఆ శాఖ గ్రామీణ ఉద్యోగులు (జీడీఎస్) కోరారు. బుధవారం రాత్రి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఆయన స్వగృహంలో గృహంలో కలసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గుంపుస్వామి ఉద్యోగులను చీడపురుగుల్లా చూస్తున్నట్లు ఎంపీతో మొరపెట్టుకున్నారు. వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగులకు సంబంధించిన వారసులకు కారుణ్య నియామకాలు ఇవ్వడంలోనూ తీవ్ర జాప్యం చేస్తూ మానసిక క్షోభకు గురి చేస్తున్నట్లు వాపోయారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఏ ఉద్యోగి అయినా సర్వీసులో ఉండి చనిపోతే వారి వారసులకు మూడు నెలల్లోగా ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు. అలాగే కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి సైకిల్ మెయింటెనెన్స్ అలవెన్స్ (సీఎంఏ), ఆఫీస్ మెయింటెనెన్స్ అలవెన్స్(ఏఎంఏ), చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ బిల్స్ వంటివేవీ గ్రామీణ ఉద్యోగులకు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. పని భారం ఆధారంగా స్కేల్స్ పెంచడం, తగ్గించడం కోసం అన్ని పోస్టాఫీసుల నుంచి డిపార్ట్‌మెంట్ గణాంకాలు రాబట్టేవారని గుర్తు చేశారు. అయితే ఎస్పీగా గుంపుస్వామి వచ్చిన తరువాత కేవలం స్కేల్స్‌ను తగ్గించడమే పనిగా పెట్టుకుని కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నట్లు బాధపడ్డారు. స్పందించిన ఎంపీ అంబికా కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తపాలా ఉద్యోగులను వేధిస్తున్న ఎస్పీ గుంపుస్వామిపై చర్యలు తీసుకోవాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏఐజీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్, పీ–3 సెక్రటరీ శంకరయ్య, పీ–4 సెక్రటరీ నాగేశ్వర్, పోస్టల్ కో–ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డివిజన్ ట్రెజరర్ రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, డివిజన్‌లోని ఉద్యోగులు పాల్గొన్నారు.

### డ్వాక్రా సమావేశానికి వెళ్లి మహిళ మృతి



లక్ష్మీనరసమ్మ (ఫైల్)

**అనంతపురం కార్పొరేషన్:** డ్వాక్రా సమావేశానికి వెళ్లిన ఓ మహిళ మృతి చెందిన ఘటన బుధవారం నగరంలోని 6వ రోడ్డు ఎల్‌బీ నగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నగరంలోని 6వ రోడ్డుకు చెందిన లక్ష్మీనరసమ్మ (57) మహాలక్ష్మి సంఘం సెకెండ్ లీడర్‌గా ఉంది. బుధవారం సైబర్ క్రైమ్‌కు సంబంధించి సంఘాల సభ్యులకు జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి వెళ్లిన లక్ష్మీనరసమ్మ ఉన్నఫలంగా కుప్పకూలింది. దీంతో ఆర్పీ సునీత వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బంధువులు నీరజాక్షి తదితరులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### అవినీతిపై విచారణ జరపాలి

**అనంతపురం టవర్‌క్లాక్:** వైద్యారోగ్యశాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అనంతపురం క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతి, అక్రమాలపై సీఐడీ, సీబీఐ, ఈడీలతో విచారణ జరిపించాలని కోరారు. అవినీతికి పాల్పడిన వారిని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పోతలయ్య (ఫైల్)

**రాప్తాడురూరల్:** ఆత్మకూరు మండలం సనప గ్రామానికి చెందిన ఉప్పర పోతలయ్య (55) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్న పోతలయ్య మంగళవారం అనంతపురం నుంచి బైకులో సనపకు వెళ్తుండగా అనంతపురం రూరల్ మండలం ఆలమూరు సమీపంలో కుక్కలు అడ్డురావడంతో బైకు అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు బలమైన గాయలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### ప్రిన్సిపల్ సివిల్ జడ్జి బదిలీ

**అనంతపురం:** అనంతపురం జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎం.శంకర రావు బదిలీ అయ్యారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం అడిషనల్ జిల్లా జడ్జిగా నియమితులయ్యారు. బుధవారం పలువురి జిల్లా జడ్జీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

### రాష్ట్రీయ మిలిటరీ స్కూల్‌కు ఎంపిక





యువరాజ్‌ను అభినందిస్తున్న రఘు సైనిక్ స్కూల్ యాజమాన్యం

**అనంతపురం ఎడ్యుకేషన్:** నగరంలోని రఘు సైనిక్ స్కూల్ విద్యార్థి రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు ఎంపికయ్యాడు. గత డిసెంబర్‌లో బెంగళూరులో రాష్ట్రీయ మిలిటరీ స్కూల్ ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థి ఎల్.యువరాజ్ 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించాడు. బుధవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థి యువరాజ్‌ను రఘు సైనిక్ స్కూల్ డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్ అభినందించారు. దేశవ్యాప్తంగా ఐదు సీట్లు ఉన్న ఓబీసీ కేటగిరీలో తమ పాఠశాల విద్యార్థి సీటు సాధించడం ఆనందంగా ఉందన్నారు.

### ముగిసిన స్క్రిప్ట్ రైటింగ్ శిక్షణ



అనంతకు విచ్చేసిన దర్శకులతో ఫిల్మ్ సొసైటీ సభ్యులు

**అనంతపురం కల్చరల్:** ఫిల్మ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో అనంత వేదికగా సాగుతున్న లఘు చిత్రోత్సవంలో భాగంగా రెండు రోజుల పాటు సాగిన స్క్రిప్ట్ రైటింగ్ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. సినీ దర్శకుడు రషీద్ బాషా నేతృత్వంలో జరుగుతున్న వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన దుర్గా రమేష్ ఔత్సాహిక చిత్ర సమర్పకులకు మెలకువలు ఇచ్చారు. మొత్తం 12 కథలు రాయించగా.. వాటిలో ఒకదానిని ఉత్తమ స్క్రిప్ట్‌గా ఎంపిక చేస్తామన్నారు. జీఎంఎస్ గ్యాలరీ సహకారంతో రూ.50 వేల బడ్జెట్‌తో లఘు చిత్రం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2న అనంత వేదికగా పెద్ద ఎత్తున సాగే ఉత్సవంలో పలువురు బుల్లితెర, సినీ సాంకేతిక నిపుణులు పాల్గొంటారన్నారు. విజేతలను అప్పుడే ప్రకటిస్తామన్నారు. అలాగే వివిధ టాపిక్‌లపై షార్ట్ అండ్ రీల్స్‌ను ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేస్తామని రియాల్టీ అధినేత సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ సభ్యులు నబీ రసూల్, తోట బాలన్న, యాంకర్ రమేష్, కవి టీవీరెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### డ్రైవర్ నిర్లక్ష్యంతో యువకుడి మృతి



బస్సు ఢీకొనడంతో మృతి చెందిన మోహన్ నాయక్

**అనంతపురం:** డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఇటుకలపల్లి ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కూడేరు మండలం ఉదిరిపికొండ తండాకు చెందిన మోహన్ నాయక్ (25) ద్విచక్ర వాహనంలో ఎస్కేయూ వైపు వెళ్తున్నాడు. పంగల్‌రోడ్డు సమీపంలో ఉన్న శిల్పా లేపాక్షి వద్ద మోహన్ నాయక్‌ను అనంతపురం నుంచి కదిరికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో మోహన్ నాయక్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మహేశ్వర అనే బస్సు డ్రైవర్ అతి వేగంగా నడపడంతో యువకుడు మృతి చెందినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆటో బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

**అనంతపురం:** గుత్తి రోడ్డులోని ఎన్టీఆర్ మార్గ్‌లో బుధవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటన చోటు చేసుకుంది. నగరంలోని జన చైతన్య కాలనీకి చెందిన బాబా ఫక్రుద్దీన్ ఆటోలో వస్తుండగా.. రోడ్డుకు అడ్డంగా ఆవు రావడంతో అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో ఆటో వెనుక వస్తున్న స్కూల్ బస్సు వేగంగా ఢీకొట్టింది. ఆటో బోల్తా పడటంతో డ్రైవర్ బాబా ఫక్రుద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

**అనంతపురం:** దళిత కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల సాగు భూమి, ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని జిల్లా కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, అధ్యక్షుడు సూరి ఏటకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత కాలనీల్లో కనీసం మంచి నీటి సౌకర్యం కూడా లేదన్నారు. శింగనమల, పుట్లూరు, ఆత్మకూరు మండలాల్లోని సింహభాగం గ్రామాల్లో శ్మశాన వాటికలు కూడా లేవని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్, పెద్దయ్య, నాగభూషణం, జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ నాణ్యతకు హామీ భారతి సిమెంట్



ప్రమాద బీమా బాండ్లు అందజేస్తున్న టెక్నికల్ ఇంజినీర్ మోతీలాల్ నాయక్

**అనంతపురం టౌన్:** నిర్మాణ రంగంలో భారతి సిమెంట్ నాణ్యతకు మారు పేరు అని భారతి సిమెంట్ జిల్లా టెక్నికల్ ఇంజినీర్ మోతీలాల్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలో ఎంఆర్టీ ఎంటర్ ప్రైజెస్ వద్ద భవన నిర్మాణ రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలపై తాపీమేస్త్రీలకు భారతి సిమెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిమెంట్ రంగంలో అనతి కాలంలోనే వినియోగదారుల మన్ననలను అందుకుని అగ్రగామిగా భారతి సిమెంట్ నిలుస్తోందని తెలిపారు. జర్మన్ టెక్నాలజీ, రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్, ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్‌తో వినియోగదారులకు కచ్చితమైన తూకం, నాణ్యమైన ప్రమాణాలతో చెరవేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణంలో సైతం భారతి సిమెంటు నాణ్యతగా ఉంటుందన్నారు. భవన నిర్మాణ రంగంలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, మెలకువలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తాపీమేస్త్రీలకు అవగాహన కల్పించారు. అనంతరం రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సేల్స్ మేనేజర్ సుబ్బరాయుడు, భారతి సిమెంట్ డీలర్ మోహన్ నాయక్, తాపీ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ



పాడి పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

**రాప్తాడు:** లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయవచ్చని పశుసంవర్ధక శాఖ జిల్లా ఉప సంచాలకులు రమేష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పుల్లలరేవు గ్రామంలో ఉచిత గర్భకోశ పశు వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ ప్రక్రియతో పాడి రైతులకు బోలెడు ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. లింగ నిర్ధారిత వీర్యం సూదులను ప్రభుత్వమే సరఫరా చేస్తుందని పేర్కొన్నారు. ఈ వీర్యం వలన 90 శాతం పెయ్య దూడలే జన్మిస్తాయని తెలిపారు. విదేశీ జాతుల దూడలే కాక స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్పర్కార్ వంటి జాతుల దూడల బ్రీడ్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఈ లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యధిక పాడి కోసం పెయ్య దూడలు మాత్రమే పొందే ఆధునిక సాంకేతిక విప్లవంగా ఈ పథకం మారుతుందని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆరు పశువులకు కృత్రిమ గర్భధారణ సూదులు వేశారు. 18 పాడి పశువులకు గర్భ చికిత్సలు, 56 పెద్ద పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. గొర్రెల, మేకలకు బద్ద పురుగులు, ఏలుక పాములు నివారణ మందులు తాపించారు. అలాగే 16 దూడలకు నులిపురుగుల మందు, 72 పశువులకు బాహ్య పరాన్న జీవులైన పిడుదులు, పేల నివారణకు స్ప్రే చేయించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు ప్రకాష్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ప్యాచ్ వర్క్ పరిశీలన



సూచనలిస్తున్న మేయర్ వసీం

**అనంతపుంర కార్పొరేషన్:** నగరంలో చేపడుతున్న ప్యాచ్ వర్క్‌ను నాణ్యతగా చేపట్టాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని 31వ డివిజన్ నుంచి 40వ డివిజన్ వరకు జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో అవసరమైన అన్ని ప్రాంతాల్లో ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, డీఈ నరసింహులు, పార్టీ వలంటీర్ విభాగం నగరాధ్యక్షుడు కోనా రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### డీఆర్వోపై చర్యలు తీసుకోరా?



జేసీ చాంబర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

**అనంతపురం:** ఎస్సీ కులాల వర్గీకరణ ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పక్కనే ఉండగా.. పేకాట ఆడిన డీఆర్వో మలోలపై చర్యలు తీసుకోరా అని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జేసీ శివ నారాయణ శర్మ చాంబర్ ముందు నిరసన వ్యక్తం చేశారు. డీఆర్వో మలోలను తక్షణం విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వినతులు, సమస్యలపై కనీసం డీఆర్వో శ్రద్ధ చూపకపోగా.. ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడుకుంటూ కాలక్షేపం చేయడం సిగ్గుచేటన్నారు. డీఆర్వో మలోలకు ఎస్సీలు అంటే గిట్టదని.. ఆయనపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ సుగామంచి శ్రీనివాసులు, ఆర్పీఐ కేపీ రాజు, జేఏసీ నాయకులు దొన తిమ్మప్ప, గోపాల్, గోవిందు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అనంతరత్న అవార్డు గ్రహీతకు సన్మానం



ఎల్లన్నను సన్మానిస్తున్న ఆర్‌ఈఓఫ్ నాయకులు

**అనంతపురం సెంట్రల్:** ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నెరమెట్ల ఎల్లన్న అనంతరత్న అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుడు రామచంద్ర ఆధ్వర్యంలో నెరమెట్ల ఎల్లన్నను ఘనంగా సన్మానించారు.

**కలెక్టర్‌కు సన్మానం**

**అనంతపురం:** నూతనంగా ఎన్నికైన రెవెన్యూ ఎంప్లాయిస్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు శాలువా కప్పి సన్మానించి జ్ఞాపిక అందజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఎంప్లాయిస్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గొని సంజీవ రెడ్డి, సెక్రెటరీ పుట్లూరు హరిప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ కే.శ్రీనివాస మూర్తి, వైస్ ప్రెసిడెంట్ టి. హరిప్రసాద్, ఎస్. చంద్రరేఖ, మారుతి ప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వీడియో, ఫొటోగ్రాఫర్ల సంఘం ఎన్నికలు**

**అనంతపురం కల్చరల్:** స్థానిక లలిత కళాపరిషత్తులో బుధవారం అనంతపురం డాగురే ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల అనుబంధ సంస్థల ఎన్నికలు సందడిగా జరిగాయి. హర్ష రమేష్ ప్యానల్, మోహనరెడ్డి ప్యానల్ వారు పోటీపడగా మోహనరెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ప్రతాపరెడ్డి, కార్యదర్శిగా అమరనాథరెడ్డి,, జాయింట్ సెక్రటరీగా కృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా హనీఫ్ ఇతర సభ్యులు విజేతగా నిలిచిన నూతన కార్యవర్గంలో ఉన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా పలువురు ఫొటో, వీడియోగ్రాఫర్లు ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

### సంక్షిప్త సమాచారం

**నేటి నుంచి సౌత్‌జోన్ వెటరన్స్ క్రికెట్ టోర్నీ**

**అనంతపురం:** ఆర్డీటీ స్టేడియంలో గురువారం నుంచి సౌత్‌జోన్ వెటరన్స్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 2వ తేదీన టోర్నీ ముగియనుంది. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు జట్లు ఇందులో ప్రాతినిథ్యం వహించనున్నాయి. సౌత్‌జోన్ లీగ్ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**భక్తిశ్రద్ధలతో పురంధరదాస ఆరాధన**

**అనంతపురం కల్చరల్:** వాగ్గేయకారుడు పురంధర దాస ఆరాధన ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. మొదటి రోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు, హస్తోదక సేవలు నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక సంబరాలు జరిగాయి. నాట్యాచార్యులు దేవర కొండ కౌసల్య శిష్యబృందాలు స్వామి బృందావనం ముందు పురంధర దాస కీర్తనలపై శాస్త్రీయ నృత్యాలు, కోలాటాన్నిప్రదర్శించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనపరచిన చిన్నారులను మఠం నిర్వాహకులు అభినందించారు.

## శుభ ముహూర్తాలకు వేళాయె


- నేటి నుంచి మాఘ మాసం ప్రారంభం



**అనంతపురం కల్చరల్:** ఎంతో విశిష్టమైన మౌని అమావాస్య రాకతో బుధవారం పుష్య మాసం ముగిసి గురువారం నుంచి సుముహూర్తాల మాఘ మాసం ప్రారంభం కానుంది. పరిణయ ముహూర్తాలను వెంటబెట్టుకొచ్చిన ఈ మాసంలో వందలాది జంటలు ఏకం కానున్నాయి. పెళ్లిళ్లే కాకుండా గృహ ప్రవేశాలు, నామకరణోత్సవాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు... తదితర శుభకార్యాలతో ఇంటింటా భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు మోగనున్నాయి.

**పండుగలూ అధికమే..**

ఈ నెల 30 నుంచి వచ్చే నెల 28 అమావాస్య వరకు ఉండే మాఘ మాసంలో వచ్చే శుభముహూర్తాలతో పాటూ పండుగలు కూడా అధికంగానే ఉంటాయి. ముఖ్యంగా ఈ మాసంలో మాఘ స్నానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సూర్యోదయానికి ముందే స్నానమాచరిస్తే విశేష పుణ్యఫలమని అందరూ భావిస్తారు. ఈ మాసంలో జాతర్లు, తిరునాళ్లు సందడి చేయనున్నాయి. మాసం చివరి రోజున వచ్చే మహాశివరాత్రి మాఘమాసానికే ఆధ్యాత్మిక శోభను చేకూరుస్తోంది. ఈ నెల 31న వాసవీ ఆత్మార్పణ దినాన్ని అనంతపురం వేదికగా విశేషంగా జరుగుతుంది. అలాగే వచ్చే నెల 3న వసంత పంచమిని పురస్కరించుకుని అక్షరాభ్యాసాలు పెద్ద ఎత్తున జరగనున్నాయి. 4న ప్రత్యక్ష భగవానుడైన సూర్యదేవర ప్రీతికరమైన రథసప్తమి, బంజారాల ఇష్టదైవమైన సేవాలాల్‌జయంతి, రామకృష్ణ పరమహంస, దయానంద సరస్వతీ, మార్కండేయ జయంతి పర్వదినాలు అందరిలో భక్తిభావాన్ని పెంచనున్నాయి.

> **అత్యంత పవిత్ర మాసం**
>
> 
>
> మాఘం అంటేనే మానసిక ఆనందాన్ని కలిగించే అత్యంత పవిత్ర మాసం. ఎన్నో జాతర్లు, తిరునాళ్లు వరుసగా వస్తాయి. ఇక శుభముహూర్తాల కోసం ఎదురు చూసేవారికి మాఘం ఎంతో శుభప్రదం. ఫిబ్రవరి 2, 7, 8, 12, 15, 16, 19, 23 తేదీలలో విశేషంగా లాభించే ముహూర్తాలున్నాయి.
>
> – వాసుదేవరావు, పురోహితుడు